## రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో సిఐలు, ఎస్ఐల బదిలీ



హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : రాచకొండ పోలీసు కమిషనరేట్‌లో పలువురు సీఐలు, ఎస్ఐలు బదిలీ అయ్యారు. ఐదుగురు సీఐలు, ముగ్గురు ఎస్ఐలను బదిలీ చేస్తూ రాచకొండ పోలీసు కమిషనర్ డిఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. సీఐ వి.మన్మోహన్ సిసిఎస్ నుంచి యాదాద్రి భువనగిరి డిపివో పిసిఆర్‌కు బదిలీ చేశారు. సిఐలు వి.స్వామి, పి.వెంకటేశ్వర్లు, పి.గుర్వారెడ్డిలను స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. సీఐ బి.ప్రవీణ్‌కుమార్‌ను కుషాయిగూడ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. ఎస్ఐ ఎం.విక్రమ్‌రెడ్డిని పోచంపల్లి పోలీస్‌స్టేషన్‌కు, ఎస్ఐ వి.సైదిరెడ్డిని ఎల్బీనగర్ సిసిఎస్‌కు, ఎస్ఐ డి.అశోక్‌ను ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

## మధుస్వరమాలిక సినీగాన యాగం

ధర్నాచౌక్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: వర్ధమాన సాంస్కృతిక సేవా సంస్థ మధుస్వర మాలిక నిర్వహణలో పన్నెండు గంటలపాటు కొనసాగిన యుగళ గీతాలాపన విశేషంగా ఆకట్టుకుంది. శనివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో ఉదయం 9 నుండి రాత్రి 9 గంటల వరకు గానాలాపాన ఒక యాగంలా నిర్వహించారు. ప్రముఖ టీవీ మాధ్యమాలలో పాటల పోటీలలో విజేతైన యువ గాయకుడు ఆదిత్య రంగన్, శ్రీకాంత్, ఉమా మాధవిలతో కలసి పాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అబిడ్ భూషన్, సంగీత దర్శకులు సాయిదేవ్, నిర్మాతలు నాగేందర్, అనిల్ పాల్గొని గాయకులతో పాటు ప్రముఖ నాట్య గురువులు పద్మాకళ్యాణ్, కీబోర్డు కళాకారుడు బ్రహ్మానందం, వయోలిన్ గాయకుడు మురళీధరలను సత్కరించారు.



# హైదరాబాద్ వార్త

# భానుడి ప్రతాపం.. ఆరోగ్యంపై ప్రభావం

### పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ● పొంచి ఉన్న డీహైడ్రేషన్ ముప్పు

**ఏప్రిల్ నెలలోనే మాడుతోంది..**

**నగరంలో ఎండల తీవ్రత పెరిగింది. పగటిపూట భానుడు భగ్గుమంటున్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. వాతావరణం పొడిగా మారడంతో చాలా ప్రాంతాలలో 36 డిగ్రీలపైనే నమోదయ్యాయి. ఏప్రిల్ నెలలోనే మాడు పగిలే ఎండలతో నగరవాసులు ఉసూరుమంటున్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉక్కపోత మొదలైంది. రాగల మూడు రోజుల వరకు వాతావరణం పొడిగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పగటి ఉష్ణోగ్రతలు 36 నుంచి 39 డిగ్రీల మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 19 నుంచి 22 డగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని సూచించింది.**



హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : పగటి ఉష్ణోగ్రతలు నెమ్మదిగా పెరుగుతున్నాయి. తాజాగా గరిష్టంగా 39 డిగ్రీల సెల్సియస్ దాటింది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. నిత్యం ఎండలో తిరిగేవారు ఖచ్చితంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వీరికి ఎక్కువగా డీ హైడ్రేషన్ ముప్పు ఎక్కువ. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాయామం, ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలన్నారు. వ్యాయామం ఉదయం ఆరు నుండి ఏడు గంటల మధ్య పూర్తి చేసుకోవాలి. బారెడు పొద్దెక్కిన తర్వాత వాకింగ్ వద్దు, బయట పనులు ఉదయం 9గంటల లోపు పూర్తి చేసుకోవాలి. మధ్యాహ్నం 4 గంటలోపు ఎండలో తిరగడం మంచిది కారు. పిల్లల్ని సాయంత్రం తర్వాతే ఆడుకోనివ్వాలి. ఉక్కపోతకు చెమట రూపంలో శరీరంలో నీరంతా బయటకు పోతున్నపుడు నీరసం వస్తుంది. అలసట, నిస్సత్తువ ఉంటుంది. మంచి ఆహారం, ఆరోగ్య పానీయాలతో నిస్సత్తువకు చెక్ పెట్టవచ్చునని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. సమతుల్య ఆహారం తీసుకోవాలని చెబుతున్నారు. మాంసాలు, ఉప్పు, కారం ఉండే కూరలు, వేపుళ్ళు ఎక్కువగా తీసుకోవద్దు. నీళ్లశాతం ఎక్కువగా ఉండే ఆకుకూరలు, కూరగాయలతో చేసుకునే పదార్థాలు తీసుకోవడం మేలు చేస్తాయి. ఉప్పు కలిసిన నిమ్మరసం, మజ్జిగ, ఓఆర్ఎస్ లాంటి ద్రావణాలు తీసుకుంటే నీరసం దరిచేరదు. కీరదోస, క్యారెట్, క్యాబేజి, ఉల్లి, టమాటా ముక్కలు, పెరుగుతో సలాడ్లు ఎక్కువగా తీసుకుంటే శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవచ్చు. లెమన్ రైస్, కొత్తమీర రైస్, పుదీనా రైస్, పాలక్ రైస్ చేసుకోవడం వల్ల శరీరానికి మంచి పోషకాలు అందుతాయి. అవసరమైతే ఉదయం సాయంత్రం చపాతీలు తీసుకోవచ్చు. మధ్యాహ్నం మాంసాహారం తినకపోవడం మంచిది. భోజనం తరువాత ఏదైనా ఒక ఫ్రూట్ తప్పనిసరిగా తీసుకోవాలి. మామిడి, కర్బూజ, ఫైనాఫిల్, బొప్పాయి లాంటివి తీసుకుంటే శరీర ఉష్ణోగ్రతలను సమతుల్యంగా ఉంచుతాయి. భోజనం చివర పెరుగు లేదంటే మజ్జిగ తీసుకుంటే శరీరానికి సోడియం, పొటాషియం అందుతుంది. నిస్సత్తువ దరిచేరదు. ఎండలో ఎక్కువ పనిచేసే వారు అన్నం, ములక్కాయ, సొరకాయ, పొట్లకాయ, క్యారెట్, అనపకాయ ముక్కలువేసి సాంబారు చేసుకోవాలి.

**విద్యుత్ వినియోగం పైపైకి..** ఎండలు పెరగడంతో నగరంలో కరెంట్ వినియోగం కొద్దిరోజులుగా అమాంతం పెరిగింది. ఇటీవల వరకు రోజువారీ వినియోగం 50 మిలియన్ యూనిట్లు ఉండగా... ఇప్పుడు 57 మిలియన్ యూనిట్లు దాటింది. ఎండ వేడి నుంచి చల్లదనం కోసం ఏసీల వాడకం మొదలైంది. పగలూ రాత్రి వీటి వాడకంతో వినియోగం పెరుగుతోంది. ప్రస్తుతం రోజువారీ గరిష్ట డిమాండు సుమారు మూడువేల మెగావాట్లుగా ఉంది.



కుడా స్టేడియం, చార్మినార్ వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

# బాలుడి హత్య కేసులో ఇద్దరు అరెస్టు

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : సంచలనం రేకిత్తించిన బాలుడి హత్య కేసులో సనత్‌నగర్ పోలీసులు ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. గురువారం సాయంత్రం సనత్‌నగర్ అల్లావుద్దీన్ కోఠీలో ఆర్థిక లావాదేవీల కారణంగా బాలుడు వహీద్ ఖాన్ హత్య జరిగిన విషయం తెలిసిందే. సీసీ ఫుటేజీ పరిశీలనలో వెల్లడైన ఆంశాల నేపథ్యంలో హత్యతో ప్రత్యక్ష ప్రమేయం ఉన్న ట్రాన్స్‌జెండర్ ఇమ్రాన్ ఖాన్ అలియాస్ ఫిజాజాన్‌తో పాటు మృతదేహాన్ని తన ఆటోలో తరలించిన ఆటో డ్రైవర్ రఫీఖ్ (29)ను పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. బాలుడి తండ్రి వసీంఖాన్‌తో ఉన్న ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఇమ్రాన్‌ఖాన్ అలియాస్ ఫిజాజాన్ బాలుడు వహీద్ ఖాన్‌ను హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. నమాజుకు వెళుతున్న బాలుడు వహీద్ ఖాన్‌ను పథకం ప్రకారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు కొని తీసుకురమ్మని తన ఇంటికి వచ్చేలా ఫీజాజాన్ పథకం రచన చేసింది. అనుకున్నట్లుగానే ఇంటిలోకి వచ్చిన వెంటనే బాలుడి గొంతు నులిమి హత్య చేసిన ఫిజాజాన ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని పెయింట్ బకెట్‌లో కుక్కి దానిని తెల్లటి ప్లాస్టిక్ బ్యాగులో ప్యాక్ చేసింది. ఇక మసీదు నమాజు సమయంలో అంతా ప్రార్థనలు చేసుకునే సమయంలో జన సంచారం తక్కువగా ఉంటుందని భావించి 6.30 గంటలకు ఖచ్చితంగా రావాలంటూ ఎర్రగడ్డకు చెందిన రఫీఖ్ అనే ఆటో డ్రైవర్‌తో ముందే మాట్లాడింది. సరిగ్గా అనుకున్న సమయానికి ఫీజాజాన్ ఇంటికి చేరుకున్న ఆటో డ్రైవర్ ఇంట్లో నుండి బరువుగా ఉన్న ప్లాస్టిక్ బ్యాగ్ ప్యాక్‌ను కొద్ది దూరంలో ఉన్న ఆటోలోకి ఎక్కించాడు. ఘటన చోటు చేసుకున్న ఇంటికి సమీపంలో ఉన్న సీసీ కెమెరాల్లో హత్యకు ముందు, ఆ తరువాత చోటు చేసు కున్న పరిణామాలన్నీ నిక్షిప్తం కావడంతో పోలీసులు ఫిజాజాన్, ఆటో డ్రైవర్ రఫీఖ్‌ల ప్రమేయాన్ని నిర్ధారించుకుని వారిద్దరిని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

**దిష్టి తాలూకు వస్తువులని చెప్పి..** మృతదేహాన్ని ప్యాక్ చేసిన సంచి గురించి ఫిజాజాన్ ఆటోడ్రైవర్‌కు కొన్ని స్పష్టమైన సూచనలు చేసినట్లు తెలుస్తోంది. తెల్లటి ప్లాస్టిక్ బ్యాగులో ప్యాక్ చేసినవన్నీ అమావాస్య నాడు దిష్టికి సంబంధించిన వస్తువులని, వీటిని ఎక్కడా తెరవకుండా నీళ్లు పారుతున్న నాలాలో పడేయాలని ఫిజాజాన్ చేసిన స్పష్టమైన సూచనల నేపథ్యంలో ఆటో డ్రైవర్ అదేవిధంగా ప్లాస్టిక్ డబ్బా ప్యాక్‌ను సనత్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని జింకలవాడ నాలాలో పడేశాడు. ఇవే విషయాలు రఫీఖ్ పోలీసులకు సూచించడమే కాకుండా తాను డంప్ చేసిన ప్రదేశాన్ని కూడా పోలీసులకు చూపించిన విషయం తెలిసిందే. హత్యకు సంబంధించి రఫీఖ్‌కు సమాచారం ఉండి ఉంటుందనే అనుమానంతో పోలీసులు అతనిని రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉంటే ఈ హత్యోదంతంతో వీరిద్దరేనా మరికొంత మంది ఉండే అవకాశముందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా బాలుడి హత్య తరువాత ఎటువంటి గొడవలు జరగకుండా సనత్‌నగర్ పోలీసులు ఏర్పాటు చేసిన పికెట్ శనివారం కూడా కొనసాగింది.





## భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు

హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : రంజాన్ పర్వదినం సందర్భంగా శనివారం మసీదులు, ఈద్గాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దీంతో నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. పాతబస్తీ మిరాలం ఈద్గా, చార్మినార్ పరిసర ప్రాంతాలతో పాటు మాసబ్ ట్యాంక్ హాకీ మైదానం, అంబర్‌పేట జిహెచ్ఎంసి మైదానం, సికింద్రాబాద్ రాణిగంజ్ తదితర చోట్ల సామూహిక ప్రార్థనలు చేశారు. కెపిహెచ్‌బి కాలనీలో ఉన్న ఈద్గాలో మంత్రి మహమూద్‌అలీ, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సికింద్రాబాద్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లు సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సనత్‌నగర్‌లోని వెల్ఫేర్ సెంటర్ గ్రౌండ్‌లో వేలాది మంది ముస్లింలు నిర్వహించిన సామూహిక ప్రార్థనలో మంత్రి తలసాని పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లింలను ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ తెలిపారు. అంబర్‌పేట జిహెచ్ఎంసి మైదానంలో జరిగిన సామూహిక ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ముస్లింలను ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ తెలిపారు. రంజాన్ సందర్భంగా నగరంలో పలు చోట్ల పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

## చార్మినార్, కుడా స్టేడియం వద్ద ముస్లింల ప్రార్థనలు

### పాతబస్తీలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

చార్మినార్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : రంజాన్ పండును ముస్లింలు శనివారం అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. రంజాన్ నెలలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఆకాశంలో నెలవంక కనిపించటంతో శనివారం ఈదుల్ ఫితర్ (రంజాన్ పండుగ)ను జరుపుకున్నారు. పాతబస్తీలోని ఏ ప్రాంతంలో చూసిన రంజాన్ పండుగ వాతావరణం కనిపించింది. రంజాన్ పర్వదినం సందర్భంగా మక్కామసీదు, చౌక్ మసీదులో పాటు ఇతర మసీదులను అందంగా తీర్చిదిద్దారు. చారిత్రక మీరాలం ఈద్గాలో జరిగిన సామూహిక ప్రార్థనలో వేలాది మంది ముస్లిం సోదురులు పాల్గొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా పాతబస్తీలో గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. కాలాఫత్తర్, జహాను బహదూర్‌పుర, మొయిన్‌పుర, దూద్‌బౌలి, హాసన్‌నగర్, కామాటిపురతో పాటు పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది ముస్లిం సోదరులు పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న చారిత్రక మీరాలం ఈద్గాలో జరిగిన ఈదుల్-ఫితర్ ప్రార్దనలకు హాజరయ్యారు. ప్రార్దనలు అనంతరం ఒకరికి ఒకరూ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మీరాలం ఈద్గాలో జరిగిన ప్రార్దనలు సందర్భంగా గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ మీరాలం ఈద్గాలో ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియ జేశారు. ఎంఐఎం కార్పొరేటర్లు మీరాలం ఈద్గాలో జరిగిన ఈదుల్ ఫితర్ ప్రార్థనలలో పాల్గొన్నారు. నగర పోలీస్ శాఖకు చెందిన పోలీస్ ఉన్నతాధికాలు విక్రమాన్ సింగ్, సుధీర్ బాబు,గజారావు భూపాల్ దక్షిణ మండలం డిసిపి పి.సాయి చైతన్యలు శాంతి భద్రత ను పర్యవేక్షించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు,విద్యుత్, వాటర్ వర్క్స్, జిహెచ్ఎంసి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.కాగా చార్మినార్ సమీపంలోని మక్కామసీదులో జరిగిన ప్రార్థనలకు మొగల్‌పుర, హుస్సేనీఆలం, లాడ్‌బజార్, శాలిబండ, గుల్జారాహౌస్, భవానీనగర్, డబీర్‌పురతోపాటు పాతబస్తీ లోని అనేక ప్రాంతాలకు ముస్లిం సోదరులు హాజరయ్యారు. చార్మినార్ ఎసిపి రుద్ర భాస్కర్ అధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## ఎమ్మెల్యే మైనంపల్లిని పరామర్శించిన మంత్రి



ఎమ్మెల్యే మైనంపల్లిని పరామర్శిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

అడ్డగుట్ట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: సికింద్రాబాద్ యశోధ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్‌ను శనివారం రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితి, అంది స్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా సికింద్రాబాద్ వాటర్స్ వర్క్స్ జనరల్ మేనేజర్ రమణారెడ్డి గుండె సమస్యతో యశోధ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జలమండలి జిఎంను కూడా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అత్తేల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని పండుగలకు ప్రాధాన్యం: హోంమంత్రి



హోంమంత్రి మహమూద్ అలీని కలిసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్న బిఆర్ఎస్ ఇంచార్జి పుస్తె శ్రీకాంత్

చార్మినార్,ఏప్రిల్ 22 ప్రభాతవార్త : రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీని శనివారం హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీ కాంత్ ఆధ్వర్యంలో చార్మినార్ నియోజకవర్గానికి చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు కలిసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజే శారు. ఈ సందర్భంగా హోంశాఖ మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని పండుగులకు ఎంతో ప్రాధా న్యత ఇస్తున్నదని తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు పవన్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## పర్యాటక ప్రాంతాలకు డబుల్ డెక్కర్ బస్సులు

### ప్రస్తుతం ఫ్రీ.. ఆ తర్వాత కనీస చార్జీ

హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : అప్పుడెప్పుడో నగర రోడ్లపై పరుగులు తీసిన డబుల్ డెక్కర్ బస్సులు మళ్లీ కనువిందు చేయబోతున్నాయి. పర్యాటకులకు ప్రయాణ మధురానుభూతిని పంచనున్నాయి. దాదాపు రెండు దశాబ్దాల క్రితం వరకు నగర రోడ్లపై రయ్యి మంటూ దూసుకెళ్లిన డబుల్ డెక్కర్ బస్సులు మరోసారి రోడ్లపైకి అందుబాటులోకి వచ్చాయి. పర్యాటకుల స్పందనను బట్టి డబుల్ డెక్కర్ బస్సులను తిప్పాలని అధికారులు యోచిస్తున్నారు.ప్రస్తుతం 6 డబుల్ డెక్కర్ బస్సులు నడపనున్నారు. రూ.12.96 కోట్లతో గతంలోనే ఆరు డబుల్ డెక్కర్ ఏసీ ఎలక్ట్రిక్ బస్సులను హెచ్ఎండిఎ కొనుగోలు చేసింది.వీటిని భవిష్యత్‌లో 30 బస్సులకు విస్తరించాలని భావిస్తున్నారు. కొత్త డబుల్ డెక్కర్ బస్సుల్లో 65 మంది ప్రయాణికులు కూర్చునే సామర్థ్యంతో పాటు డ్రైవర్‌తో పాటు, ఈ బస్సులు పూర్తిగా ఎలక్ట్రిక్‌తో ఉంటాయి. ఇవి ఒక్కసారి ఛార్జింగ్‌తో 150 కిలోమీటర్లు ప్రయాణించగలవు. పూర్తిగా రీఛార్జ్ చేయడానికి కేవలం 2 నుంచి 2.5 గంటల సమయం పడుతుంది. డబుల్ డెక్కర్ బస్సుల్లో ప్రస్తుతం ఉచితంగానే ప్రయాణించవచ్చు. కొన్ని రోజుల తర్వాత కనీస ఛార్జీ విధించే అవకాశం ఉందని తెలిసింది. ఒక్కో ట్రిప్పునకు ఒక్కొక్కరికి రూ.50 చొప్పున వసూలు చేస్తారని తెలుస్తోంది. నగరంలోని పలు పర్యాటక ప్రాంతాలను చుట్టివచ్చేలా ప్రత్యేక రూట్‌ను హెచ్ఎండిఎ సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో డబుల్ డెక్కర్ బస్సులను ప్రస్తుతం కొన్ని రూట్లలో నడపనున్నారు. ముఖ్యంటీ ట్యాంక్‌బండ్, బిర్లామందిర్, అసెంబ్లీ, సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, మక్కా మసీద్‌తో పాటు తారామతి బారాదరి, గోల్కొండ, గండిపేట పార్కు, దుర్గం చెరువు, తీగల వంతెన, ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ జిల్లా ప్రాంతాల్లో నడపనున్నారు. ఉదయం ట్యాంక్‌బండ్ వద్ద బయలుదేరి ఆయా రూట్లలో తిరుగుతూ తిరిగి ట్యాంక్‌బండ్‌కు చేరుకుంటాయి. ఛార్జింగ్ కోసం ఖైరతాబాద్ ఎన్టీపి, సంజీవయ్య పార్కులో ప్రత్యేక పాయింట్లు ఏర్పాటు చేశారు.

# లిక్కర్ కిక్కుకు.. వీకెండ్ జోష్

### శుక్ర, శని, ఆదివారాల్లో తెగతాగేస్తున్న మందుబాబులు

### సాధారణ రోజుల్లో కంటే వీకెండ్‌లో మూడింతలు సేల్స్



హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: అసలే ఎండాకాలం. నోరు మంచినీళ్ల కోసం ఎండగట్టుకపోతుంది. ఆసమయంలో చుక్క మంచినీళ్లు దొరికితే చాలు అనుకుంటాం. ఇది సామాన్యుడి పరిస్థితి అయితే. మందుబాబుల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఎండకు తట్టుకోలేక బీర్లను తెగతాగేస్తున్నారు. హైదరాబాద్‌లో రోజుకు 10లక్షల లీటర్లకు పైగా బీర్లను లాగిస్తున్నారు ఈ మందుబాబులు. వీకెండ్‌లో ఎక్కువగా యువత బీర్ల వైపే మొగ్గు చూపుతున్నారు. మంచినీళ్లు తాగినట్టే తాగేస్తున్నారు. నగరంలో నిత్యం లక్షల కేసుల బీర్లు మద్యం అమ్ముడుపోతోందంటే నిషాచారులు రాష్ట్రానికి ఎంత రెవిన్యూ తెస్తున్నారో అర్థమవుతోంది. ఇక వారమంతా ఆఫీసుల్లో కష్టపడి ఉద్యోగులు, అలసట నుండి రిలీఫ్ పొందేందుకు వీకెండ్స్‌లో బీర్లు తెగ సేవిస్తున్నారు. ఈవిషయం వీకెండ్ సేల్స్ చూస్తే అర్థమవుతుంది. ఐటీ,బీపీఓ, రియాల్టీ సేవా రంగాల్లో పని చేస్తున్నవారిలో ఎక్కువ మంది శుక్ర శని వారాల్లో లిక్కర్ కిక్కుతో పసందు చేసేందుకు మక్కువ చూపిస్తున్నట్లు అమ్మకాలు చూస్తే అర్థమౌతుంది. సాధారణం రోజుల్లో రూ.10కోట్ల నుండి 15కోట్ల అమ్మకాలు జరిగితే.. వారాంతంలో మాత్రం ఈసేల్స్ 60కోట్లు దాటుతున్నట్లు అంచనా.

**బీర్లపై అధికంగా వసూలు..** జంటనగరాల్లో ఎండలవేడి పెరిగిపోతుండటంతో మద్యం ప్రియులు చల్లని బీరును కోరుకుంటున్నారు. సాధారణ రోజుల్లో కంటే వేసవిలో బీర్లకు అధికంగా డిమాండ్ ఉంటుంది. కానీ కొందరు వ్యాపారులు బీర్లకొరత ఉందనో.. ఇరత కారణాలతో బీర్లను ఎంఆర్‌పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. 20 నుండి 30 రూపాయలు అధికంగా వసూలు చేస్తున్నారు. ఇక దేశీ బీరు పరిస్థితి ఇలా ఉంటే.. విదేశీ బీర్లపై కూడా అధికంగా వసూలు చేస్తున్నారు. దేశీయ బీర్లు 150 - 200రూపాయలకు దొరుకుతుండగా.. విదేశీ బీర్లు 250 నుండి 300 వరకు లభ్యమౌతుంది. అయితే విదేశీ బీర్ల దిగుమతిపైట టాక్స్ వసూలు చేయడంత పాటు ఎంఆర్‌పీని కుడా ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. కానీ కొందరు వ్యాపారులు మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా ధరలు పెంచి అమ్ముతున్నారు. విదేశీ బీరు అనే ఒకే కారణం చూపి అధిక ధరలు వసూలు చేస్తున్నారు.

## చలివేంద్ర ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బేగంబజార్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: పాదాచారుల దప్పిక తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయని శాసనసభ్యులు దానం నాగేందర్ తెలిపారు. తెలంగాణ భజరంగ్ సేనా ఆధ్వర్యంలో బసవ తారక, ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బిఆర్ఎస్ శాసన సభ్యులు దానం నాగేందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బజరంగ్‌సేనా ఉపాధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త, కార్యదర్శి సూర్యశుక్లా, రాము, చందు, కృష్ణ, రాజేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్ రజక అభివృద్ధి సంస్థ కార్యదర్శిగా రవి, వైస్ చైర్మన్‌గా నర్సింగ్‌రావు



అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: తెలంగాణ రజక(దోబి) అభివృద్ధి సంస్ద గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శిగా ఎస్.రవి, వైస్‌చైర్మన్‌గా డి.నర్సింగ్‌రావులను నియమించారు. ఈమేరకు గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం.నర్సింహ నియామక ఉత్తర్వులను అందచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి భాద్యతలు అప్పగించినందుకు భాద్యత యుతంగా సంస్థ అభివృద్ధి కొరకు పాటుపడుతామన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో రజకులు విద్య, వైద్య, రాజకీయ రంగాలల్లో రాణించవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైస్‌చైర్మన్లుగా ఎ.బాల్‌రాజ్, జి.అశోక్, ఎన్.స్వామి, బాబు, హరినాథ్, ఎన్.ప్రధాన కార్యదర్శిగా ఎన్.రవి, పి.కిషన్, చంద్రమోహన్, కె.నర్సింగ్‌రావు, సుధాకర్, కార్యదర్శి సాయిసత్యనారాయణ, సిహెచ్.శ్రీనివాస్, మధు, మహేందర్, నర్సింగ్‌రావు, వెంకటేశ్వర్, రమేష్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన బీఆర్ఎస్ నేత

ధర్నాచౌక్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బీఆర్ఎస్ నేత, వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వి.శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. శనివారం రంజాన్ పండుగ సందర్భంగా హోంమంత్రి నివాసంలో జరిగిన వేడుకలలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, హోంమంత్రి మహ మూద్ అలీ తదితరులను కలసి శుభాకంక్షలు తెలియచేసి నట్లు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ నేతలు ఆజం అలీ, వెంకటేశ్వరరావు, కృష్ణ, సంతోష్‌గుప్తా ఉన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్

### మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి తలసాని

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం రంజాన్ పర్వదినం సందర్భంగా సనత్‌నగర్‌లోని వెల్ఫేర్ సెంటర్ గ్రౌండ్‌లో వేలాది మంది ముస్లీం సోదరులు నిర్వహించిన సామూహిక ప్రార్థనలలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్థనల అనంతరం ముస్లీంలను ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా నెలరోజుల పాటు ఎంతో నిష్టతో ఉపవాస దీక్షలు చేస్తారని తెలిపారు. రంజాన్‌ను ఎంతో సంతోషంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు ప్రభుత ్వం అన్ని ఏర్పాట్లు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు కొలన్ బాల్‌రెడ్డి, నాయకులు సరాఫ్ సంతోష్, ఖలీల్, రాజేష్, జమీర్ పాల్గొన్నారు.

## రామ సుబ్రహ్మణ్యం ధరమ్‌కు సుస్వర రాగ గాన సరస్వతి బిరుదు



రామ సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న ప్రముఖులు

ధర్నాచౌక్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: ప్రముఖ గాయకుడు రామసుబ్రహ్మణ్యం ధరమ్‌కు సుస్వర రాగ గాన సరస్వతి బిరుదును ప్రముఖ సినీ నేపధ్య గాయకుడు సింహా భాగవతుల అందచేశారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభ ప్రధాన వేదికపై ప్రముఖ గాయకుడు త్రినాధరావు, వంశీ సంస్థల అధినేత వంశీరామ రాజులతో కలిసి ఆయన ఈ బిరుదు సత్కారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేపధ్య గాయకుల గళా లను యధాతధంగా అనుకరించి మెప్పించటం గొప్ప కళ అని, అటువంటి గొప్ప కళ ఉన్న ప్రతిభావంతుడు రాము సుబ్రహ్మణ్యం అని కొనియాడారు. జంట నగరాలలో బాలీవుడు గాయకులు కిషోర్ కుమార్, రఫీల పాటలు వారి స్వర మాధుర్యంతో పాడగల అతి కొద్ది మంది గాయకుల్లో సుబ్రహ్మణ్యం ప్రధముడని అన్నారు. సంస్థ స్థాపకులు ఎం.వీ.జీ.వీ. రావు, రోజా ప్రసన్నతల సారధ్యంలో రామకృష్ణ, అర్చన, వెంకటేశ్వరరావు, లలిత, మానస, బాంధవి, రత్నకుమారి, కొమ్మినేని భవన్నారాయణ, డేవిడ్‌రాజు, టి.శ్రీనివాసరెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీపై ఈటల నిరాధారమైన ఆరోపణలు చేశారు



ఒ.యూ పిఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న చరణ్ కౌశిక్ యాదవ్

తార్నాక, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీపై నిరాదారమైన ఆరోపనలు చేసిన ఎమ్మెల్యే ఇటల రాజేందర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ టిపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.చరణ్‌కౌశిక్ యాదవ్ శనివారం ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మునుగోడు ఉపఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ కాంగ్రెస్ పార్టీకి రూ. 25 కోట్లు ఇచ్చారని ఎలాంటి ఆధారంలేకుండా ఇటల రాజేందర్ మీడియా ముఖంగా మట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పార్టీకోసం పని చేసిన నాయకులు, కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడారని అదేవిధంగా తెలంగాణ ప్రజలు ఓట్లు అడిగితే డబ్బులు అడుగుతున్నారని కూడా ఇటల వాఖ్యలు చేశారని ఇటు పార్టీని, ప్రజలను అవమానపరిచిన ఇటలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ అడ్మిన్ ఎస్సై లక్ష్మినారాయణకు ఫిర్యాదు చేశారు. ఇటల ఉద్దేశపూర్వకంగానే ఇలా వాఖ్యానించారని అందుకోసం ఆయనపై చర్యలు తీసుకోవాలని వినపతిపత్రంలో చరణ్ కౌశిక్ పేర్కోన్నారు.

## సకాలంలో పనులు పూర్తి చేయలేని కాంట్రాక్టర్లు అవసరం లేదు



రోడ్డు మీద కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న కార్పోరేటర్

హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: సకాలం లో పనులు పూర్తి చేయలేని కాంట్రాక్టర్ల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మి రామన్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సకాలం లో పనులు పూర్తి చేయగల సత్తా ఉన్నవారికే ప్రభుత్వం కాంట్రాక్ట్ పనులు అప్పగించాలని కోరారు. డివిజన్‌లోని స్ట్రీట్ నెంబరు 16లో గత రెండు నెలల క్రితం కాంట్రాక్టర్ రోడ్డు తవ్వి పనులు పూర్తి చేయకపోవడంతో స్థానికులు ఆమెకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె ఆదివారం స్ట్రీట్ నెంబరు 16లో పర్యటించారు. వెంటనే ఆమె మున్సిపల్ అధికారి పేర్రాజుకు ఫోన్ చేసి పిలిపించడం జరిగింది. కాంట్రాక్టర్ తన మాట వినడం లేదని అధికారి ఆమెకు సమాధానం చెప్పారు. వెనువెంటనే ఆమె కాంట్రాక్టర్‌కు ఫోన్ చేస్తే కాంట్రాక్టర్ ఫోన్‌లో సరైన సమాధానం చెప్పకుండా అసభ్యంగా మాట్లాడి ఫోన్ కట్ చేయడం జరిగిందని కార్పోరేటర్ ఆరోపించారు. దీంతో ఆమె ఆగ్రహం చెందారు. వేరే కాంట్రాక్టర్ ద్వారా పనులు పూర్తి చేయించాలని ఆమె మున్సిపల్ అధికారిని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రామన్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, జైస్వాల్, మల్లేష్, సందీప్, సాయి, హితేష్, వేణుగోపాల్‌యాదవ్, అనిల్, జై తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పర్వదినాన్ని మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకుందాం

### ఎంఎల్‌సి శంభీపూర్‌రాజు



కార్పొరేటర్ మహ్మద్ రషీదా హమ్మద్‌రఫితో కలిసి కుత్బుల్లాపూర్ అంబేద్కర్‌నగర్‌లో రంజాన్ ఉత్సవాలలో పాల్గొన్న ఎంఎల్‌సి శంభీపూర్‌రాజు, కార్పొరేటర్ రషాదా మహ్మద్‌రఫి

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మతసామర్యానికి ప్రతీకగా నిలిచి మైనార్టీలకు అన్నివిధాలుగా సహాయ, సహకారాలు అందిస్తుందని ప్రభుత్వ విప్, ఎంఎల్‌సి శంభీపూర్ రాజు అన్నారు. శనివారం రంజాన్ పర్వదినాన్ని పుర స్కరించకుని కుత్బుల్లాపూర్ డివిజన్ అంబేద్కర్‌నగర్‌లో కార్పొరేటర్ రషీదా మహ్మదీరఫి ఇంట్లో ఇఫ్తార్‌విందు ఆరగించారు. ఈసందర్భంగా రషీదా హమ్మద్‌రఫి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముస్లీం పెద్దమనుషులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థను చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రావుల శేషగిరిరావు, మంత్రి సత్యనారాయణ, సింగిల్ విండో చైర్మెన్ గరిశె రాజు, గ్రంధాలయకమిటీ చైర్మెన్ నాగరాజు యాదవ్, బాల్‌రెడ్డి పార్టీ ప్రముఖులు, మతపెద్దలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## జవహర్‌నగర్‌లో ఘనంగా రంజాన్



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసులు

జవహర్‌నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: ప్రభాతవార్త : కుల మతాలకతీతంగా అందరి నోట ఈద్ ముబారక్.. అంతటా సోదర భావం.. భక్తి శ్రద్ధలు.. ప్రార్థనలతో సహృద్భావ వాతావరణం నెలకొంది. మది పులకించే అత్త పరిమళాలు.... అభిమానం, ఆప్యాయతతో ఆలింగనాలు ఇది శని వారం రంజాన్ పండుగ సందర్భంగా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ కాలనీలలో నెలకొన్న దృశ్యాలు. కార్పొరేషన్ పరిధిలోని మసీదులు, ఈద్గాలు ఈద్-ఉల్-ఫితర్ ప్రార్ధనలతో మార్మోగాయి. వెంకటేశ్వర నగర్, వికలాంగుల కాలనీ, సంతోష్ నగర్, చిన్నాపూర్, బి జె ఆర్ నగర్, అంబేద్కర్ నగర్, మల్కారం, ఫరానగర్, అరుంధతి నగర్ తదితర ప్రాంతాలలోని ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలంటూ అల్లాను ప్రార్థించినట్లు కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ నూరుద్దీన్ ఫారూఖ్, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మొహమ్మద్ సాదిక్, జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పాషామియా, టి. కాలేశా తెలిపారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు.

## మూసినది ప్రక్షాళన కోసం నేటి నుంచి పాదయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకట్‌దాస్

సైఫాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: ఒక వైపు విశ్వనగరంగా పోటీపడుతూ మరొక వైపు ధనిక నగరాలలో ఒక నగరంగా కొనసాగుతూ ప్రపంచం లోనే అత్యంత ఘగర్‌నగర్ (మదు మేహం) గా పేరుగాంచిన హైదరాబాద్ నగరంలోని ప్రజల మనుగడకు మూసినది ముప్పుగా వాటిల్లింది దని పలువురు ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేశారు. మూసినది ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే హైదరాబాద్ నగరం విషం నగరంగా మారుతుందని ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సొసైటి ఫర్ ఎర్త్ జస్టిస్ ఛైర్మన్ ప్రొఫెసర్ వెంకట్‌దాస్, ప్రతినిధులు ప్రొఫెసర్ నాగేష్, రాజారాం, ప్రొఫెసర్ రవీందర్ తదితరులు మాట్లాడుతూ మూసి పరివాహక ప్రాంతాలలో మూసి జలాలతో పండించే కూరగాయలు, ఆకు కూరలు, పాలు తదితర ఆహార పదార్థాలు, గాలి విషపూరితంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి తిన్ని ప్రజలు క్యాన్సర్, చర్మవ్యాధులు తదితర జబ్బుల భారిన పడి చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాలపై ఈ మేరకు సంబంధిత అధికారులకు పలు మార్లు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. 2018లో సిఎం కెసిఆర్ మూసి ప్రక్షాళన కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. మూసి ప్రక్షాళన కోసం ప్రజల్లో చైతన్యం కలిగించడానికి ఈ నెల 23వ తేదీ నుంచి 50 రోజులపాటు మూసి పరివాహక ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పాదయాత్ర ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు కొనసాగుతుందన్నారు. 23వ తేదీ సాయంత్రం 4 గంటలకు ముషీరాబాద్ నుంచి పాదాయాత్ర ప్రారంభమవుతుందని, ప్రతిరోజు పాదయాత్రలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ప్రతినిధులు మీనగా గోపి, రవికిషోర్, రంగనాథ్, రత్నశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పోచారం అవుశాపూర్‌లో భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 22, ప్రభాత వార్త: రంజాన్ పర్వదీనం సందర్భంగా పోచారం మున్సిపల్ పరిధిలోని నారపల్లిలో ముస్లీం సోదరులను బీఆర్ఎస్ నాయకులు శనివారం కలిసి పండుగ శుభాకాంక్షాలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు మందాడి సురేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, కౌన్సిలర్ సుర్వీ రవీందర్‌లు కో ఆప్షన్ సభ్యులు ఎండీ. అక్రం అలీ తదితరులు ముస్లీం సోదరులను కలిసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఘట్‌కేసర్ మండలంలోని అవుశాపూర్ గ్రామంలో ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ముస్లీం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మతంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి మిఠాయిలు పంచి పండుగ చేసుకుంటారని అన్నారు. హిందూ ముస్లీంల మధ్యన ఉన్న సోదర భావాన్ని పెంపొందించే విధంగా రంజాన్ పండుగ ప్రతి ఒక్క ముస్లీం కుటుంబంలో ఆనందాన్ని తీసుకొస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీతో పాటు సర్పంచ్ ఏనుగు కావేరి, స్థానిక నాయకులు మశ్చేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రతి ఆడబిడ్డ పెళ్లికి 11,116రూపాయలు చేయూత

శామీర్‌పేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : జగ్గంగూడ గ్రామపంచాయతీ పరిధిలోని జగ్గంగూడ, సంపన్‌బోల్, కాలనీకి చెందిన ప్రతి ఆడబిడ్డ పెళ్లికి తన వంతుగా 11,116రూపాయలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు జగ్గంగూడ గ్రామపంచాయతీ సర్పంచు సిహెచ్ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రకటించారు. శనివారం మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడ గ్రామంలో సర్పంచు విష్ణువర్ధన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు చందుపట్ల లక్ష్మి, భద్రారెడ్డిల తరపున ఆడబిడ్డ పెళ్లిలకు ఆర్థిక సహాయం అందించటం జరుగుతుందని ఆయన ప్రకటించారు.

## కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో ఘనంగా రంజాన్ వేడుకలు



ముస్లిం మతపెద్దలతో స్థానిక శాసనసభ్యులు కె.పి.వివేకానంద్

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ప్రార్థనలకు పెద్దఎత్తున మైనార్టీ ముస్లీం సోదరులు హాజరై ప్రార్థనలు నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రాంతాలలోని ముస్లీంలు, మతపెద్దలు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి వుందన్నారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, ఐటిశాఖామంత్రి తారకరామారావు పనితీరుపట్ల మైనార్టీలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని అన్నారు.

## భక్తిభావంతో రంజాన్ వేడుకలు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ మండలంలో శనివారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. గత నెల రోజులుగా ముస్లీం సోదరులు భక్తి, శ్రద్దలతో కఠోర ఉపవాసదీక్షలు నిర్వహిస్తూ శనివారం ముగించారు. ఘట్‌కేసర్, బాలాజీనగర్, గాంధీనగర్, ఎన్ఎఫ్‌సీనగర్, కొండాపూర్, ఎదులాబాద్, చౌదరిగూడ, వెంకటాద్రిటౌన్‌షిప్, మక్తా, సాదత్‌ఆలీగూడ, ఓయూ కాలనీ, జోడిమెట్ల, మర్రిపల్లిగూడ తదితర గ్రామాల్లో ఈదుల్‌ఫీతర్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే ఈద్గాలు, మస్జీదులలో పెద్దసంఖ్యలో సాముహిక ప్రార్దణలు నిర్వహించారు. మతపెద్దలు రంజాన్ ప్రాముఖ్యతను వివరించారు. మార్కెట్‌లో గత నెలరోజులుగా రంజాన్ కొనుగోళ్లతో మార్కెట్ రద్దీగా మారింది. ఘట్‌కేసర్ మున్సిపల్ శివారెడ్డిగూడ మారుతీనగర్‌లోని ఈద్గాలో ముస్లీం సోదరులు పెద్ద సంఖ్యలో చేరుకొని సాముహిక ప్రార్దణలు చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ నుంచి తగిన ఏర్పాట్లు చేయగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఐసీఐఎఫ్ ఆధ్వర్యంలో ఈద్గాకు వచ్చిన వారికి త్రాగునీరు సరఫరా చేశారు. ఈద్గా వద్ద ప్రార్దణల అనంతరం ప్రజాప్రతినిధులు, నాయకులు వచ్చి ముస్లీం సోదరులను ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు రమాదేవి, అంజనేయులు, జహంగీర్, నర్సింగ్‌రావు, కోఆప్షన్ సభ్యులు శౌకత్‌మియా, మస్జీదుకమిటీ అధ్యక్షులు అబ్దుల్‌అజీజ్, మైనారిటీ అధ్యక్షులు కుతుబుద్దిన్ తదితరులు పాల్గొన్నారు. బాలాజీనగర్‌లో మైనారిటీ నాయకులు ఎండి.సిరాజ్ ప్రజాప్రతినిధులు, నాయకులను ఆహ్వానించి రంజాన్ ప్రత్యేక వంటకమైన శీర్‌ఖుర్మాను తినిపించారు. సీఐ అశోక్‌రెడ్డి, డీఐ జంగయ్యలు వచ్చి ముస్లీంలను కలిసి శుభాకాంక్షలు తెలుపగా సిరాజ్ వారిని సన్మానించారు.

## గండిపేట మండలంలో ఘనంగా రంజాన్ వేడుకలు



రాజేంద్రనగర్ ఎమ్మెల్యేకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుతున్న గండిపేట మండల బిఆర్ఎస్ నాయకులు

నార్సింగి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : గండిపేట మండలంలో రంజాన్ పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. గండిపేట, నార్సింగి, నెక్‌నాంపూర్, మంచిరేవుల, హైదర్షాకోట్, పీరంచెరువు, దర్గా కలిస్కాన్, బండ్లగూడ జాగీర్ ప్రాంతాలలో రంజాన్ పర్వదినం సందర్భంగా మసీదులు, ఈద్గాలు, దర్గాలన్నీ ప్రత్యేక నమాజ్ చేసేందుకు వచ్చిన ముస్లీంలతో కిటకిటలాడాయి. నమాజ్‌ల అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వీరికి స్థానిక హిందువులు, ప్రజా ప్రతినిధులు సైతం శుభాకాంక్షలు తెలిపారు. మణికొండ మున్సిపల్‌కు చెందిన మైనార్టీ నేత బషీర్ నాయకత్వంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు భారీ గజమాల వేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గండిపేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు ఆర్.నర్సిహ్మా, సీనియర్ నాయకులు పి.చంద్రశేఖర్‌రెడ్డి, టి.మల్లేష్ ముదిరాజ్, మణికొండ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, అధ్యక్షులు బి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. అలాగే బండ్లగూడలో మేయర్ మహేందర్‌గౌడ్, సీనియర్ నాయకుడు పాపయ్య యాదవ్, సయ్యద్ ఖాజా, అస్లాం తదితర ముస్లీం కార్పోరేటర్లకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. నార్సింగి మున్సిపాలిటీలో వైస్ ఛైర్మన్ వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్లు శివారెడ్డి, సునీత గణేష్, విజేత ప్రశాంత్ యాదవ్, పి.శ్రీకాంత్ తదితరులు ముస్లీంలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

## మే9న శిల్పకళా వేదికలో మేగా జాబ్ మేళా

హైదరాబాద్, ఏప్రిల్ 22,ప్రభాతవార్త: ఉపాధిలేని నిరుద్యోగ యువతకు మే 9న మాదాపూర్ హైటెకిసిటీలోని శిల్పకళా వేదికలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు హెచ్‌వైఎస్‌ఈ వ్యవస్థాపకులు మనేష్ కొండూరి తెలిపారు. ఈమేరకు శనివారం మాదాపూర్‌లోని రామ్‌ఎస్‌విఆర్‌లో జరిగిన కార్యక్రమంలో 101వ జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 9న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఈమేగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటీ, హెచ్‌ఆర్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, అడ్మినిస్ట్రేషన్, మ్యానుఫ్యాక్చరింగ్, ఫ్రెషర్లు అనుభవజ్ఞుల కోసం దాదాపు వంద దేశీ ఎంఎన్‌సి కంపెనీలు పాల్గొటాయని ఆసక్తిగల నిరుద్యోగులు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

## మోదీతోనే రాష్ట్రంలో చారిత్రక కట్టడాలకు పూర్వవైభవం

### బిజెపి రాష్ట్ర నాయకులు గానుకపాటి సూర్యనారాయణ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణశర్మ

హైదరాబాద్, ఏప్రిల్ 22,ప్రభాతవార్త: దేశప్రధాని నరేంద్రమోదీ హయాంలో తెలంగాణ చరిత్ర, సాంస్కృతిక ,చారిత్రక కట్టడాలకు పూర్వ వైభవం వచ్చిందని బిజెపి రాష్ట్ర నాయకులు గానుకపాటి సూర్యనారాయణ శర్మ అన్నారు. శనివారం సాయంత్రం రాంనగర్ గుండులోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యనారాయణ శర్మ హాజరై మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ చొరవతో రాష్ట్రంలో వారసత్వ సందపకు సరైన గౌరవం దక్కుతుందని తెలిపారు. ప్రధాని మోదీ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సంస్కృతి, సాంప్రదాయాల కళలను భావితరాలకు అందించేందుకు ఎంతో కృషి చేస్తుందన్నారు. తెలంగాణ పండుగలు బతుకమ్మ ,బోనాలు, మేడారం జాతరలో యాత్రిలకు సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో కేంద్రం తనవంతు తోడ్పాటు అందించిందని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ మన్కీబాత్ కార్యక్రమంలో నగరంలోని బన్సీలాల్ పేట్ మెట్ల భావిని ప్రస్తావించి అద్భుతంగా తీర్చిదిద్ది పూర్వ వైభవం తీసుకువచ్చారని కొనియాడారన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అత్యధికంగా నిధులు కేటాయిస్తే రాష్ట్రంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం బిజెపి ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. ఈకార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కౌడన్య ప్రసాద్, ఎన్నారై శేషసాయి, వంశీ, అధ్యక్షులు నరేష్, గౌరీశంకర్ ,రాజు, గణేష్ ,శేఖర్, గోపాల్ దాస్ తదితరులు పాల్గొన్నారు.


CLASSIFIEDS

VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, 607641K JWO DILEEP KUMAR SETTALURI (Existing Name as per Service Documents/PPO No.08/14/B/ 11203/ 1987), son of Late Shri Venkata Narayana Settaluri, resident of H. No.5-4-1438, Sharadanagar, Vanasthalipuram, Hydera bad 500070 Telangana have changed my Name from Dileep Kumar Settaluri (Existing Name as per Service Documents/PPO) to Settaluri Dilip Kumar (Proposed/Corrected New Name) as per Notarized Affidavit dated 31-01-2023.

(Ro.No.2508)

TO LET OR RENT

★ GROUND FLOOR Two Bedroom Hall Kitchen Store Bath WC For Rent Kalabhairava Hanumantemple Hussainialam Gopalji 9346666675

(Ro.No.3256)

LOSS OF DOCUMENTS

★ I, P.Ashwin Kumar S/o Late P.Yadava Rao resident of H.No.13-1-1210 and 1211, Mustaidpura, Kummarwadi, Hyderabad, submit that I have lost my registered documents bearing numbers 1838/ 2015 (B) & 5135/ 2016 and its link documents, while traveling from Sharada Nagar to my residence. Please contact me on my contact number 9700303007, if anyone finds the above mentioned documents.

(Ro.No. 063463)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

PUBLIC NOTICE

All the Public are hereby informed that my client Smt.Pelluru Anasuya W/o. P.Bhaskara Rao, R/o.Flat No.A-501, Fortune Towers, Madhapur, Hyderabad- 500 081, during shifting of their residence from Gunfoundry to present residence lost original Sale Deed Doc.No.4434/1984 dated 09.07.1984 pertaining to open Plot bearing No.77 in the residential layout made, ad measuring 267 Sq. Yards (33 1/3 ankanams) situated at Sy.No.57/1, 57/3, Buja Buja Village, Nellore Panchayat, Taluk & District. In spite of meticulous search efforts the said document is not traced. If anyone find the above may handover the same to the undersigned or my client and if anyone has any claim may contact the undersigned within two weeks and thereafter no claims shall be entertained and deemed as not valid and my client will deal with the property on this basis by obtaining certified copy from the concerned SRO.

Sd/-PSR Chandra Murthy
Advocate
Flat No.101, Kala Nilayam,
H.No.16-10-27/46/6, 80/2RT
MCH Colony, Malakpet,
Hyderabad- 500036,
Mob:7396827347

THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE, AT : MALKAJGIRI
O.S. No.213 OF 2023

Between:
Sri. Sajan George and others ...Plaintiffs
AND
1. The Tahasildar, MalkajgiriMandal, Medchal-Malkajgiri District
2. All Concerned ...Defendants

NOTICE

TO WHOMSOEVER IT MAY CONCERN
Take notice that the Plaintiffs filed the above suit for Declaration of Legal Heirs before the Hon'blel Addl. Junior Civil Judge, Malkajgirivide O.S. No. 213/2023 declaring that they are the exclusive legal heirs their mother Smt. Mariamma George (died on 29.05.2020) in respect of suit schedule propertymentioned below. Hence, who ever have any objections over this suit are requested to appear in person or through Advocate on 02.06.2023 at 10.30 A.M. before the above said Hon'ble Court, failing which the matter will be decided exparte accordingly.

SCHEDULE OF PROPERTY

All that 50% share in Flat No. 203 bearing Municipal No. 34-142/203 in Second Floor, admeasuring 1550 Sq. Feet built up area including common areas and car parking space in stilt etc., in the Multi-Storied Residential Complex known as "CRESENT'S CASTLE" together with undivided share of land admeasuring 40.00 Sq. Yards or equivalent to 33.44 Sq. Meters out of total land admeasuring 920.00 Sq. Yards or 769.12 Sq. Meters constructed in premises bearing Nos. 34-142 and 34-143 on Plot Nos. 10-A/1 and 10-A/2 in Survey No. 219/1, situated at "Bharani Colony" under Malkajgiri Municipality and Mandal, Medchal - Malkajgiri District (the then Ranga Reddy District) consisting of stilt + 5 upper floors and bounded by: North: Staircase, open to sky and Flat No.204, South: Open to sky, East: Corridor, open to sky and Flat No. 202, West: Open to sky.

(BY ORDER OF THE COURT)
T. RAGHAVENDRA RAO
A. SANJAY, Advocates
H. No. 2-4-215, Road No. 9A,
Snehapuri Colony, Nagole,
Hyderabad-500102. Cell: 99660 88568

రిపోర్టర్లు కావలెను

'వార్త' తెలుగు జాతీయ దినపత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషపై మంచి పట్టు ఉండి, స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన వారు అర్హులు. ఈ ప్రకటన వెలువడిన వారం రోజుల్లోగా దరఖాస్తు చేయాలి.

1. పంజాగుట్ట 2. బంజారాహిల్స్ 3. జూబ్లీహిల్స్
4. మాదాపూర్ 5. రాజేంద్రనగర్ 6. సుల్తాన్‌బజార్
7. ముషీరాబాద్ 8. నారాయణగూడ 9. కార్వాన్
10. అంబర్‌పేట 11. మౌలాలి 12. నల్లకుంట
13. నాచారం 14. బోయిన్‌పల్లి 15. చర్లపల్లి
16. పీర్జాదిగూడ 17. గోల్కొండ

దరఖాస్తులు పంపవలసిన చిరునామా
హెచ్‌ఆర్ మేనేజర్
'వార్త' జాతీయ తెలుగు దినపత్రిక
# 396, లోయర్ టాంక్ బండ్, హైదరాబాద్.

# మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి ఎన్ని నిధులు తెచ్చారో ప్రకటించాలి : అందెల డిమాండ్



సమావేశంలో సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన సమాచారాన్ని వెల్లడిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి కోసం స్థానికఎమ్మెల్యే, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రభుత్వం నుండి ఎన్ని నిధులు తెచ్చారో ప్రకటించాలని నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం నాదర్‌గుల్‌లోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన సమాచారహక్కు చట్టంద్వారా సేకరించిన గడచిన మూడు, నాలుగేళ్ల లో నియోజకవర్గానికి సంబంధించి మంజూరైన, ఖర్చు చేసిన, ఖర్చు చేయని సిడిఎఫ్,ఎస్‌డిఎఫ్, సిఎస్‌పి నిధుల వివరాలను వెల్లడించారు. నియోజకవర్గం లో కేవలం స్థానిక సంస్థల నిధులతో మాత్రమే అభివృద్ధి జరుగుతుంది తప్ప ప్రత్యేకంగా తెచ్చిన నిధులతో కాదని ఆయన ఆరోపించారు. అయితే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ద్వారా ఎక్కడెక్కడ ఎన్నెన్ని నిధులు వచ్చాయో వెల్లడించే దుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. మహేశ్వరం నియోజకవర్గం నుండి వందల కోట్ల ట్యాక్సులు, రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వం గజ్వేల్, సిద్ధిపేట్, సిరిసిల్లలో ఖర్చు చేస్తుంటే ఏమి చేస్తున్నారని మంత్రిని అందెల ప్రశ్నించారు. సిఎంను ప్రశ్నించే దమ్ము సబితా రెడ్డికి లేదని ఆయన విమర్శించారు. మహేశ్వరం నుండి కాకుండా రాజేంద్ర నగర్ నుండి ఎన్నికల్లో పోటీ చేసేందుకు పావులు కదుపుతున్నారని ఆయన ఆరోపించారు. త్వరలో మహేశ్వరం నియోజకవర్గంలో అభివృద్ధి ...నిధుల పరిస్థితిపై ప్రభుత్వం ద్వారా సేకరించిన సమాచారాన్ని బయటపెడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకటరెడ్డి, బడంగ్‌పేట్, కార్పొరేషన్, తుక్కుగూడ మున్సిపాలిటీ బిజెపి ఫ్లోర్ లీడర్లు తోట శ్రీధర్‌రెడ్డి, ఎరుకల శివకుమార్, పార్టీ నాయకులు నిమ్మల శ్రీకాంత్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్‌లను ఎరుకల కులస్తులకు కేటాయించాలి : ఎరుకల గిరిజన అభివృద్ధి సేవా సంస్థ

**మన్సూరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధి లోని నాగోల్ డివిజన్ సర్వే నెంబర్ 4,5 పరిధిలోని ఎరుకల నాంచారమ్మ బస్తీలో ప్రభుత్వం రెండు బ్లాక్‌లలో 288 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించ గా అందులో ప్రస్తుతం 200 కుటుంబాలకు చెందిన అన్ని వర్గాల ప్రజలు నివసిస్తున్నారని, బి బ్లాక్‌లో ఇంకా 88ఇండ్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని అక్కడే నివాసం ఉంటున్న అర్హులైన గిరిజన, ఎరుకల కులస్తులకు ఇవ్వాలని ఎరుకల నాంచారమ్మ బస్తి అభివృద్ధి సేవా సంస్థ ఫౌండర్ వనం గంగయ్య, నాంచారమ్మకాలనీ అధ్యక్షుడు జగన్నాధం ప్రభుత్వాన్ని కోరారు. శనివారం డబుల్‌రూమ్‌వద్ద అర్హులైన వారితో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ 2019నుండి ఇంకా ఇండ్లు రాని గిరిజన ఎరుకల కులస్తులు రెవిన్యూ కార్యాలయం, ఎమ్మెల్యే, కార్పొరేటర్ల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరుగుతున్నామని, రెవిన్యూ అధికారులు మాత్రం ఈ విషయంలో పలుమార్లు ఘటన స్థలాల్లో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారని, అయినా కూడా అర్హులైన వారికి ఖాళీగా ఉన్న ఇండ్లు ఇవ్వడానికి అధికారులు అభ్యంతరం ఎందుకు తెలుపుతున్నారో అర్థం కావడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వెంటనే జోక్యంచేసుకొని అన్ని విధాలుగా ఎస్టీల్లో ఎరుకల కులస్తులు వెనుక బడి ఉన్నారని, పలుమార్లు సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేసిన కూడా లోలోపల మాత్రం సుమారు 50 ఇండ్లను వేరే ప్రాంతాల నుండి వచ్చిన వారికి ఇవ్వగం చారని మండిపడ్డారు. మిగతా వాటిని కేవలం తమ కులంలో ఉన్న పేదలకు, వారి ఆర్థిక స్థితిగతులను దృష్టిలో పెట్టుకొని పక్కనే ఉన్న ఇండ్లను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సిద్ధిని స్వామి, వనం యేసు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు


మజ్జిగ పంపిణీ చేస్తున్న సామ రంగారెడ్డి, పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** అక్షయ తృతీయ సందర్భంగా మోహన్‌నగర్ చౌరస్తాలో కొత్తపేట డివిజన్ బిజెపి నాయకుడు ఉపేందర్‌సింగ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా బిజెపిఅధ్యక్షులు సామ రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయి కోటి పవన్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. పలువురికి వారు చలివేంద్రంలో మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నందికొండ గీతారెడ్డి, మంచి రాజేష్, సంగ్రామ్, సుందర్‌నారాయణ, రాకేష్ యాదవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభను విజయవంతం చేయాలి : శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** చేవెళ్ళలో ఆదివారం కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హాజరయ్యే బిజెపి సంకల్ప సభను విజయవంతం చేయాలని రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి పార్టీ శ్రేణులను కోరారు. సభ నేపథ్యంలో శనివారం ఆయన మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్ బాలాపూర్ గ్రామంలో ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా జరిగే అమిత్ షా సభకు చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గం నుండి లక్ష మంది తరలిరానున్నారని అయితే మహేశ్వరం నియోజకవర్గంనుండి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.ప్రభాకర్‌రెడ్డి, పెది ంటి సుధాకర్, శేఖర్‌రెడ్డి, బి.బాలకృష్ణ, శ్రీనివాస్, రవి, లక్ష్మణ్‌రాజు, లింగారెడ్డి, ముద్దం లక్ష్మారెడ్డి, గురువయ్య, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ ఉమ్మడి అమ్మవారి ఆలయానికి టేకు తలుపుల విరాళం

**సరూర్‌నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మీర్‌పేట్ పాత గ్రామంలో పునర్నిర్మాణానికి నోచుకున్న నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ ఉమ్మడి దేవాలయ ప్రధాన ద్వారాలకు గ్రామానికి చెందిన తీగల స్రవంతి క్రాంతి కిరణ్‌రెడ్డి దంపతులు టేకు తలుపులను విరాళంగా అందజేశారు. మాజీ ఉప సర్పంచ్ స్వర్గీయ తీగల మధుకర్‌రెడ్డి కుమారుడు, కోడలు స్రవంతి, క్రాంతి కిరణ్‌రెడ్డిలు రూ.1.50 లక్షలతో తయారు చేయించి టేకు తలుపులను శనివారం ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీకి చెందిన తీగల సాయినాథ్‌రెడ్డి తదితరులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ అర్టీజన్ కార్మికులకై ఈ నెల 25న తలపెట్టిన సమ్మె విజయవంతం చేస్తాం..

**నేరెడ్‌మెట్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షులు బాలిరెడ్డిని అరెస్టు చేయడం సరైందికాదని సైనిక్‌పురి డివిజన్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీనా విద్యుత్ కార్మికుల సమస్యలకై చేపట్టిన సమ్మె విజయవంతం కాకుండా బాలిరెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే దిశగా చేపట్టిన సమ్మెను ఎట్టి పరిస్థితుల్లో అపేది లేదన్నారు. ఎన్నో యేళ్ళుగా విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నామన్నారు. 24 గంటలు విధులు నిర్వహిస్తూ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేయడం జరుగుతుందన్నారు. వెంటనే అధ్యక్షులు బాలిరెడ్డిని విడుదల చేయాలని వారు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సైనిక్‌పురి డివిజన్ విద్యుత్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు : ఆర్ఐ విశ్వనాథ్


అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం.

**జవహర్‌నగర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ప్రభుత్వ స్థలాలలో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకొని నిర్ధాక్షిణ్యంగా కూచివేస్తామని జవహర్ నగర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ విశ్వనాథ్ హెచ్చరించారు. శనివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పలు అక్రమనిర్మాణాలను తొలగించారు. సర్వే నెంబర్లు 158లో రెండు రూములు, 210 లో ఒక రూము ,నాలుగు బేస్మెంట్లు, 348లో ఒక రూము, 693 లో బేస్మెంట్‌ను జెసిబి సహాయముతో కూల్చివేశారు. ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించిన రెవెన్యూ ఇన్స్పెక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములలో స్థలాలు కొనుగోలు చేయరాదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూముల్లో అక్రమనిర్మాణాలు చేపడితే ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా కూల్చివేతలు చేపడతామన్నారు. ఇక్కడి భూకబ్జాదారుల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయునట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పండుగలు సోదర భావాన్ని పెంపొందిస్తాయి : ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** పండుగలు సోదర భావాన్ని పెంపొం దిస్తాయని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా పేర్కొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా టిడిపి రంగారెడ్డి జిల్లా మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ జహంగీర్ నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు కుల, మతాలకు అతీతంగా కలసిమెలసి జరుపుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా జహంగీర్ తన కుటుంబ సభ్యులతో కలసి జిహెచ్‌ఎంసి సిబ్బందిని శాలువాలతో సత్కరించి, వారికి కొత్త దుస్తులను పంపిణీ చేశారు. పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ దయనంద్‌గుప్తతో పాటు నాయకులు ఆకుల అరవింద్‌కుమార్, పెండ్యాల నగేష్, వెంకట్‌గౌడ్, జహంగీర్‌బాయ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


## రంజాన్ వేడుకల్లో పాల్గొన్న నగర డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి

**తార్నాక, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి పలువురు ముస్లిం మైనార్టీ నాయకులను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా ఓ.యూ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అక్బర్ బేగ్ నివాసానికి వెళ్లి రంజాన్ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అదే విదంగా లాలాపేట్, తార్నాకలోని పలువురికి వారు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

## దండెం రాంరెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ చేసిన టీపీసీసీ క్రమశిక్షణ సంఘం..?

**అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ నాయకుడు దండెం రాంరెడ్డికి టీపీసీసీ క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ మాజీ మంత్రి, డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి గారి షోకాజ్ నోటీసులు జారి చేసారు. పార్టీ నియమావళిని ఉల్లంఘించినందుకు నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. టీపీసీసీ కార్యదర్శి పేరుతో మండల పార్టీ అధ్యక్షులకు, మున్సిపల్ అధ్యక్షులకు, స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు నిర్వహించడంపట్ల పలువురు మండల పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ అధ్యక్షులు అధిష్టానానికి ఫిర్యాదు చేసారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన అనంతరం టీపీసీసీ క్రమశిక్షణ సంఘం పార్టీ నియమాలను ఉల్లంఘించినందుకు దండెం రాంరెడ్డికు షోకాజ్ నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ మండల పార్టీ, మున్సిపల్ అధ్యక్షులకు, స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వకుండా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేయడమే కాకుండా అవసరమైతే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.

## రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు


హయత్‌నగర్‌లో రంజాన్ వేడుకల్లో ఇన్‌స్పెక్టర్, నాయకులు

**హయత్‌నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** ముస్లింలకు పవిత్రమైన రంజాన్ పండుగను పురస్కరించుకుని హయత్‌నగర్‌లోని పెద్దమసీదు(హయత్‌భక్షీ మసీదు)తో పాటు పెద్దఅంబర్‌పేట, పసుమాముల, తట్టిఅన్నారం, కుంట్లూర్ లోని మసీదులలో ముస్లింలు శనివారం ఉదయాన్నే ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు కౌగిలించుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మిఠాయిలు, షీర్‌కుర్మాను స్నేహితులు, బంధువులకు పంపిణీ చేశారు. హయత్‌నగర్ పెద్దమసీదులో నిర్వహించిన కార్పొరేటర్ ప్రార్థనలో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామతిరుమల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, నాయకులు భాస్కర్ సాగర్, గుడాల మల్లేష్, రాకేష్‌కుమార్‌లు పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## అష్టలక్ష్మి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి శేష వాహన సేవ

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** అష్టలక్ష్మి దేవాలయాలు బ్రహ్మోత్సవాల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా శనివారం స్వామివారి శేషవాహనసేవా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మి దేవాలయంలో 27వ బ్రహ్మోత్సవ కార్యక్రమంలోభాగంగా శనివారం మూర్తికుంభస్థాపన, అగ్నిప్రతిష్ట, ధ్వజారోహణ, భేరిపూజ, దేవత ఆహ్వానం తదితర కార్యక్రమాలను వేద బ్రాహ్మణుల మంత్రంమధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, చైర్మన్ సోమ సురేష్, కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్యగుప్తా, బ్రహ్మోత్సవ కమిటీ కన్వీనర్ గౌరిశెట్టి అరుణ్, ధర్మాధికారి జయశంకర్ బాలగోపాల్, కమిటీ సభ్యులు చిలుకా ఉపేందర్‌రెడ్డి, బొగ్గరపు రవీందర్, తమ్మన శ్రీధర్, గండి శ్రీకాంత్, దాచేపల్లి శ్రీనివాస్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి పండుగలు నిదర్శనం : దేప


ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న భాస్కర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ మసిద్‌లో మతపెద్దలు మక్సుద్‌హైమద్, అబ్దుల్‌జబ్బార్ తో కలిసి భాస్కర్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు రంజాన్ ఈద్–ఉల్–ఫితర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో కఠోర ఉపవాస దీక్షలు చేసి, ఫిత్రా, జాకాత్ లతో పేదలకు సహాయం చేయటం ఎంతో గొప్ప విషయం అన్నారు. ఇస్లాం సమాజానికి అహింస, శాంతి, ప్రేమ, దయ, కరుణ, సౌభ్రాతృత్వాన్ని బోధిస్తుందని అన్నారు. రంజాన్ పండుగ హిందూ, ముస్లింల మధ్య సోదర భావాన్ని పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, బండి మధుసూదన్‌రావు, నల్లెంకి ధనరాజ్‌గౌడ్, అక్బర్, నబీ, జహంగీర్, జాని, పటేల్, అసిఫ్, ఇస్మాయిల్, పింటు పూర్ణచందర్, వరుణ్, సంతోష్ కుమార్, అనుదీప్ పాల్గొన్నారు.

## పేదలకు కొండంత అండ ముఖ్యమంత్రి సహాయ నిధి : డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్త

**జవహర్‌నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** వైద్యఖర్చులు భరించలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా ఉంటుందని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రెడ్డి శ్రీనివాస్‌గుప్త అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిదవ డివిజన్, పాపయ్య కాలనీలో నివసించే డి. భారతి అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స ఖర్చులకోసం ముఖ్యమంత్రి సహాయానికి దరఖాస్తు చేసుకోగా 60వేల రూపాయలు మంజూరయ్యాయి. ఈ మేరకు గురువారం డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ ఆయన కార్యాలయంలో చెక్కును బాధితురాలికి అందజేశారు. అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడేవారు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోలేని వారికి ముఖ్యమంత్రి సహాయనిధి వరం లాంటిదని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారగోని వెంకటేష్, ఈగ రాజు, బాలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే బాలిక మృతి : సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి

**జవహర్‌నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** ప్రభుత్వం నిర్లక్ష్యంవల్ల ఇటీవల బాలిక ఆమీన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందని టీపిసిసి అధికార ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం కో ఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆరోపించారు. గురువారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివాజీనగర్ మార్వాడి లైన్‌లో నివసించే మృతురాలి కుటుంబ సభ్యులను ఆయన స్థానికనాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం హరి వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. జవహర్ నగర్ ప్రధాన రోడ్డు పనులు చేపట్టి సంవత్సరం గడుస్తున్న పూర్తి చేయలేదని, ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే 13 ఏళ్ల చిన్నారి రోడ్డు ప్రమాదంలో మరణించిందని ఆరోపించారు. చిన్నారి మృతికి ప్రభుత్వం, స్థానిక మంత్రి, కార్పొరేషన్ పాలకవర్గం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కిరణ్ చౌదరి, అనంతలక్ష్మి, గండి సునీత, మాట్ల శ్రీనివాస్, చింత విజయ శేఖర్, శంకర్, ధనమ్మ, జయమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఇంజాపూర్ గ్రామంలో రంజాన్ వేడుకలు

**తుర్కయంజాల్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటి పరిదిలోని ఇంజాపూర్ గ్రామంలో రంజాన్ పండుగ పురస్కరించుకొని స్థానిక ఈద్గా దగ్గర ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులకు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్‌గౌడ్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మైనారిటీ అధ్యక్షులు మహమ్మద్ గౌస్ పాషా, మహమ్మద్ యాసీన్, మహమ్మద్ ఇల్యాస్, మహమ్మద్ మజీద్, మస్జిద్ అధ్యక్షులు మహమ్మద్ రహీమ్,మహమ్మద్ మజర్, మహమ్మద్ ఇజాస్, మహమ్మద్ ఉస్మాన్ ,మహమ్మద్ బురహన్, మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్బీనగర్ ఏప్రిల్ 22 :** ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలో అసోసియేషన్ ఆధ్వర్యంలో కేర్ హాస్పిటల్ సహకారంతో వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని, కాలనీవాసులు వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో కాలనీఅధ్యక్షులు సుధాకర్, శ్రీనివాస్, అశోక్‌చారి, కుమార్, సునీత, వాణి, నాయకులు వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మోకాలు శస్త్రచికిత్స చేయించుకున్న మల్కాజిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును పరామర్శించిన పశుసంవర్ధక, మత్స్య, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ (ప్రభాతవార్త, మల్కాజిగిరి)

## సమైక్యత, సమానత్వమే రంజాన్ : మల్‌రెడ్డి


మల్‌రెడ్డి రాంరెడ్డిని సన్మానిస్తున్న ముస్లిం సోదరులు

**మన్సూరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** రంజాన్ పర్వదినం సందర్భంగా ఎల్.బి.నగర్‌లోని మసీద్‌లో ఎల్.బి.నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మల్‌రెడ్డి రామ్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ మనందరిలో సహోదర భావాన్ని పెంపొందిస్తూ, సమానత్వం, సమైక్యత స్ఫూర్తిని నింపాలని ఆకాంక్షిస్తూ అల్లా అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ రంజాన్ మాస ఉపవాస దీక్షలను ముగించుకుని ఈద్ ఉల్ ఫితర్ వేడుకను జరుపుకుంటున్న ముస్లిం సోదర, సోదరీమణులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి,నరసింహయాదవ్, లింగాల కిషోర్‌గౌడ్, కుమార్, నరసింహయాదవ్, మంజులారెడ్డి, స్వర్ణమాధవి, సురేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, అరుణ్, సౌమ్యరెడ్డి, కవిత, యాదగిరి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తాం: జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జయమ్మ

**సరూర్‌నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో క్షేత్ర స్థాయి నుండి కాంగ్రెస్ బలోపేతానికి మహిళా కాంగ్రెస్ కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షురాలు జయమ్మ తెలిపారు. మంద మల్లమ్మ చౌరస్తాలోని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి సంబంధించిన మహేశ్వరం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జయమ్మ అధ్యక్షతన జిల్లా మహిళా కాంగ్రెస్ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇంఛార్జి సదా లక్ష్మి సమక్షంలో పార్టీ బలోపేతం, చేపట్టాల్సిన కార్యక్రమాలు, బూత్‌ల వారీగా మహిళా కాంగ్రెస్ పటిష్టత తదితర అంశాలపై చర్చించి పలు తీర్మాణాలు చేశారు. అదే విధంగా మే మొదటి వారంలో జరిగే ప్రియాంక గాంధీ సభను విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా మహిళా కాంగ్రెస్ కార్యక్రమాలు చేపడుతుందని వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకురాళ్లు సుభాషిణి, ఎర్రవెల్లి అరుణ, జ్యోతి, ఉమ, మాధవి, రత్నకుమారి, నాగమణి, సుజాత, భాగ్యలక్ష్మి, మమతలతో పాటు కార్పొరేషన్లు, మండలాలు, డివిజన్ల అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.


## జవహర్‌నగర్‌లో ఘనంగా రంజాన్


ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసులు

**జవహర్‌నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** ప్రభాతవార్త : కుల మతాలకతీతంగా అందరి నోట ఈద్ ముబారక్.... అంతటా సోదర భావం.... భక్తి శ్రద్ధలు... ప్రార్థనలతో సహృద్భావ వాతావరణం నెలకొంది. మది పులకించే అత్త పరిమళాలు.... అభిమానం, ఆప్యాయతతో ఆలింగనాలు ఇది శనివారం రంజాన్ పండుగ సందర్భంగా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ కాలనీలలో నెలకొన్న దృశ్యాలు. కార్పొరేషన్ పరిధిలోని మసీదులు, ఈద్గాలు ఈద్–ఉల్–ఫితర్ ప్రార్ధనలతో మార్మోగాయి. వెంకటేశ్వర నగర్, వికలాంగులకాలనీ, సంతోష్ నగర్, చిన్నాపూర్, బి జె ఆర్ నగర్, అంబేద్కర్ నగర్, మల్కారం, ఫరానగర్, అరుంధతి నగర్ తదితర ప్రాంతాలలోని ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలంటూ అల్లాను ప్రార్థించినట్లు కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ నూరుద్దీన్ ఫారూఖ్, బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మొహమ్మద్ సాదిక్, జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పాషామియా, టి. కాలేశా తెలిపారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు.

## మలక్‌పేటలో ఘనంగా రంజాన్ వేడుకలు


ముస్లీంలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న తీగల అజిత్‌రెడ్డి తదితరులు


శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఇమ్రాన్ తదితరులు

**మలక్‌పేట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** రంజాన్ పర్వదిన వేడుకలు మలక్‌పేటలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ఈద్గాలలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అక్బర్‌బాగ్‌లోని ఉజేలాష ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ నిలుస్తుందని పేర్కొన్నారు.

**తీగల అజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో...** బిఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తీగల అజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో సలీంనగర్‌లోని ఈద్గా వద్ద ముస్లీంలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోదరభావానికిప్రతీకగా రంజాన్ పండుగ నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌర శశిధర్, అభిషేకం, పవన్ తదితరులు పాల్గొన్నారు.

**ఇమ్రాన్ ఆధ్వర్యంలో...** రంజాన్ పండుగ పర్వదినం సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లీంలకు బిఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఇమ్రాన్ ఆధ్వర్యంలో పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**చౌకి రవికుమార్ ఆధ్వర్యంలో..** రంజాన్ పండుగ సందర్భంగా ఓల్డ్ మలక్‌పేట డివిజన్ టిడిపి అధ్యక్షుడు మహ్మద్ ఖదీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చౌకి రవికుమార్, గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్, డివిజన్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డిలు విచ్చేసి మహ్మద్ ఖదీర్‌కు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోమాత నవీన్ తదితరులు పాల్గొన్నారు.